




# మనం మెదక్

సంగారెడ్డి సిద్దిపేట

సోమవారం | 27 | నవంబర్ | 2023 | పేజీలు : 6


# కొట్లాడేటోనికే కత్తియ్యాలే




- అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తాం
- మూడేళ్లలో ఏకాణ పని జరగలే
- కత్తిపోట్ల సంస్కృతి వద్దు
- రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్

సిద్దిపేట/దుబ్బాక, నవంబర్ 26, మనం న్యూస్ ప్రతినిధిః కత్తి ఒకరికిచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే ఎలా..? కొట్లాడేటోనికే కత్తియ్యాలె... అభివృద్ధి పనులు జరగాలంటే ఏ పార్టీ ప్రభుత్వంలో ఉంటుందో ఆ పార్టీ వ్యక్తినే గెలిపియ్యాలే... అని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామలింగారెడ్డి మరణంతో వచ్చిన ఉప ఎన్నికల్లో నోటికి వచ్చిన వాగ్ధానాలు, ఇష్టమొచ్చిన మాటలతో గద్దెనెక్కితే మూడేళ్లలో మిగతా 2లో..







## దొర పాలన పోయి ప్రజా పాలన రావాలి

- తెలంగాణలో గెలుస్తున్నాం.. ఢిల్లీలో జెండా పాతుతాం
- నిరుద్యోగుల బతుకులు రోడ్డుపాలు
- కాంగ్రెస్ రాగానే జాబ్ క్యాలెండర్
- దోచుకున్న సొమ్ము రికవరీ చేస్తాం
- బిఆర్ఎస్, ఎంఐఎం, బీజేపిలు ఒక్కటే
- లోక్‌సభ సభ్యులు రాహుల్‌గాంధీ



సిద్దిపేట/సంగారెడ్డి, నవంబర్ 26, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ వస్తే చదువుకున్నోళ్లందరికీ నౌకర్లొస్తాయని ఎంతో ఆశతో తెలంగాణను సాధించుకుంటే కేసీఆర్ సర్కార్ వారి బతుకులను ఆగం చేసి వారి భవితను రోడ్డుపాలు చేశారని లోక్‌సభ సభ్యులు రాహుల్‌గాంధీ అన్నారు. ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు వేసినట్టే వేసి పేపర్ లీకేజీలతో వారి బతుకులను నట్టేట ముంచారన్నారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న కేసీఆర్ ఇప్పటి వరకు ఎన్ని మిగతా 2లో..



## బీజేపితోనే సామాజిక న్యాయం

- దుబ్బాక, హుజురాబాద్ ట్రైలర్.... ఇక సినిమాయే
- మల్లన్న సాగర్ బాధితుల గోస పట్టదా?
- స్కీముల పేరుతో స్కాములు చేసిన కేసీఆర్
- అధికారంలోకి వస్తే బిసియే ముఖ్యమంత్రి
- మాదిగలకు అన్యాయం జరగనివ్వం
- దేశ ప్రధాని నరేంద్ర మోదీ



సిద్దిపేట, నవంబర్ 26, మనం న్యూస్ ప్రతినిధిః సామాజిక న్యాయం, సుస్థిర పాలన బీజేపితోనే సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బడుగుబలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం మినహా పార్టీలు వారికి చేసిన ప్రయోజనమేమీ లేదని, మిగతా 2లో..

# కొట్లాడేటోనికే కత్తియ్యాలే

మొదటి పేజీ తరువాయి..

ఏకాణ పని జరగలే. అసలప్పుడే నేనొస్తే ఈ కథనే ఉండకపోవు... ఎవ్వరికీ అన్యాయం చేయని, గర్వంలేని వ్యక్తి కేపీఆర్‌ను గెలిపియ్యాలన్నారు. ఇన్నేళ్లలో ఎప్పుడైనా దుబ్బాకలో కత్తిపోట్ల రాజకీయాలున్నాయా..? మేమే చేయాలను కుంటే అంతకంటే పెద్ద కత్తులున్నాయి... పద్ధతి కాదని మర్యాద పాటిస్తున్నాం. దేవుడి దయతో మళ్లీ మన ముందుకు వచ్చిన కేపీఆర్‌ను గెలిపించాలన్నారు. అసైన్డ్ భూములను గుంజుకుంటామనే మాట ఉత్తదే. గుంజుకోవడం కాదు.. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులనే కల్పిస్తామన్నారు. దుబ్బాకలో నిలబడుతా అని ప్రభాకర్‌రెడ్డి అడుగలే.. దుబ్బాక హాలత్ మారాలంటే నువ్వే వెళ్లాలని నేను జెప్పినా...ప్రభాకర్‌రెడ్డి గెలిచిన నెల రోజుల్లో దుబ్బాక రెవెన్యూ డివిజన్ అయితది, మీరు కోరినట్లు ఆయా









మండలాలల్లో డిగ్రీ కళాశాలలు మంజూరైతా యన్నారు. ఒకనాడు గుక్కెడు తాగునీళ్లకు ఏడ్చిన దుబ్బాకలో కూడవెల్లి ఎండాకాలంలో పరుగులు తీస్తుంద న్నారు. రేకుల కుంట మల్లన్న, కూడవెల్లి రామలింగేశ్వర స్వామి దేవాలయా లను అభివృద్ధి చేసుకుందామన్నారు. కేంద్రంలోని బీజేపి సర్కార్ 157 మెడికల్ కళాశాలలు ఇస్తే తెలంగాణకు ఒక్కటియ్యలే.. జిల్లాకో నవోదయ పాఠశాల ఇవ్వాలని ప్రకటనలోనే ఉన్నా ఒక్కటియ్యలే. అలాంటి బీజేపికి ఒక్క ఓటు కూడా ఎందుకెయ్యాలె అన్నారు. ధరణి పోర్టల్‌తో భూములన్నీ సురక్షితంగా ఉన్నాయి. ఎద్దు, ఎవుసం తెలువని రాహుల్‌గాంధీ ఏమేమో మాట్లాడుతుండు... పొరపాటు చేసి ఇంకో పార్టీకి ఓటేస్తే పదేండ్ల కష్టం బూడిదలో పోసిన పన్నీరవుతదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే పెన్షన్‌లను రూ.5 వేలకు పెంచుతాం, రైతుబంధును ఎకరాకు రూ. 16 వేలు చేస్తామన్నారు. రైతుబంధు దుబారా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మూడు గంటల విద్యుత్ చాలని రేవంత్‌రెడ్డిలను నమ్మి ఓటేస్తే మళ్లీ చీకట్లు వస్తాయన్నారు.

# బీజేపితోనే సామాజిక న్యాయం

మొదటి పేజీ తరువాయి..

బీజేపితోనే బడుగు బలహీన వర్గాల్లో మార్పు సాధ్యమవుతుందన్నారు. ఎంతోమంది ప్రతిభావం తులైన బడుగు బలహీన వర్గాల నాయకులు ఉన్నప్పటికీ వారికి అవకాశం ఇవ్వలేదు. తెలంగాణలో బీజేపి ప్రభు త్వంలో బిసినే ముఖ్యమంత్రి చేస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో భా గంగా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్ర మంలో ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, దూది శ్రీకాంత్‌రెడ్డి, పంజా విజయ్‌కుమార్, నందీశ్వర్ గౌడ్, పులిమామిడి రాజులకు మద్ధతుగా ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలలో అవినీతి రాజ్యమేలిందని, కుటుంబ పాలన సాగుతోందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా అవకాశం పొందిన కేసీఆర్ ప్రజలకు ఎంతమాత్రం అందుబాటులో లేకుండా ఫామ్ హౌజ్‌కే పరిమితం అయ్యాడని, సచివాలయానికి అసలే పోడని, ఇలాంటి ముఖ్యమంత్రి మనకెందుకన్నారు. దళితబంధు అంటూ, దళిత సీఎం అంటూ కేసీఆర్ దళితులను మోసం చేశారని, తాము మాత్రం మాదిగలకు న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మాదిగల న్యాయమైన డిమాండ్‌పై సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం నడుస్తుందని, అది వారికి అనుకూలంగా వచ్చేందుకు తాము కూడా అండగా ఉంటామన్నారు. ప్రజా బలమే ఉంటే ఈటల రాజేందర్ గజ్వేల్‌కు వస్తుండనగానే కామారెడ్డికి ఎందుకు పారిపోయాడన్నారు. దుబ్బాక, హుజురాబాద్ ఫలితాలు ట్రైలర్ మాత్రమేనని, ఇక ముందుంది సినిమా అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, దేశంలో కాంగ్రెస్ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలాయని, అసమర్ధులకు అవకాశం ఇస్తే దేశం అధోగతిపాలవుతుం దన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు కార్బన్ కాగితాల వంటివని, వీరిద్ధరి తో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో కాంగ్రెస్ సుల్తాన్‌లను పెంచిపోషిస్తుంటే రాష్ట్రంలో బిఆర్ఎస్ రజాకార్ల వారసుల కు అండగా ఉంటుందని, వీరితో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలతో సాధించుకున్న తెలంగాణ నేడు కేసీఆర్ కుటుంబానికి డబ్బులు సంపాదించే మిషన్‌గా తయా రైందన్నారు. దుబారా ఖర్చులు చేస్తూ తెలంగాణ ప్రజలపై అప్పుల భారాన్ని మోపుతోందని, తెలంగాణను లూటీ చేసింది కాక, దేశాన్ని దోచుకోవడానికి దేశ్ కీ నేత అంటూ బయల్దేరాడన్నారు. లిక్కర్ కేసులో ఎవరినీ వదిలేది లేదని, ఇది నా గ్యారంటీ అన్నారు.

# దొర పాలన పోయి ప్రజా పాలన రావాలి

మొదటి పేజీ తరువాయి..

ఉద్యోగాలు భర్తీ చేశాడో చెప్పాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు దామోదర్ రాజనర్సింహా, జగ్గారెడ్డిలకు మద్ధతుగా నిర్వహించిన ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ రాబోయే తెలంగాణ సర్కార్‌లో మండలానికో ఇంటర్నేషనల్ స్థాయి విద్యాసంస్థలను నెలకొల్పుతామన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ హయాంలో కట్టించిన భవనాలు తప్పితే బిఆర్ఎస్ విద్యార్థుల సౌకర్యాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కమీషన్‌ల కోసం నిర్మించిన కాళేశ్వరం నాణ్యతా లోపంతో కుంగుతోందని, నేను వెళ్లే వరకు కూడా తప్పుడు ప్రచారమంటూ బిఆర్ఎస్ సమర్ధించుకుందన్నారు. ధరణి పోర్టల్ పేరుతో వేల ఎకరాల భూములను మాయం చేశారని, కాంగ్రెస్ సర్కార్ రాగానే ధరణి పోర్టల్ తొలగిస్తామన్నారు. మాట మాట్లాడితే కాంగ్రెస్ ఏం చేసిందంటూ కామెంట్ చేస్తున్న కేసీఆర్ తొమ్మిదేళ్లుగా మీరేం చేశారో చెప్పాలన్నారు. దళితబంధు పథకంలో ఎమ్మెల్యేలే అవినీతికి పాల్పడ్డారంటూ స్వయంగా కేసీఆరే చెప్తున్నాడని, దీన్నిబట్టి పథకాలు ఎవరికి దోచి పెట్టడానికో అర్థం చేసుకోవచ్చన్నారు. నిరుద్యోగులకు



ఎప్పటికప్పుడు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామన్నారు. తొమ్మిదిన్నరేళ్లుగా కేసీఆర్ సర్కార్ దోచుకున్న సొమ్మును రికవరీ చేసి పేదలకు పంచుతామన్నారు. బిఆర్ఎస్, బీజేపి, ఎంఐఎంలు ఒక్కటేనని, బీజేపిని కేసీఆర్‌తో సహా ఎవరు ప్రశ్నించినా వారిపై ఐటి దాడులుండవు, ఈడి కేసులుండవు... ఇదంతా మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమన్నారు. అదే నేడు బీజేపిని ప్రశ్నిస్తే ఇప్పటికి 24 కేసులు నమోదు చేశారన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్‌కు అండగా బీజేపి కేంద్రంలో బీజేపికి అండగా జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దు, రైతులను ముంచే నల్ల చట్టాలకు కేసీఆర్ సర్కార్ మద్ధతివ్వలేదా అన్నారు. తెలంగాణలో గెలుస్తున్నాం.. రేపు ఢిల్లీ గద్దెపై కూడా జెండా జెండా పాతుతామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అధికారంలోకి రాగానే ముమ్మాటికీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు అండగా ఉండడంతోపాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ముమ్మాటికీ చేసితీరుతామన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందిస్తామన్నారు.



# వైభవంగా కొనసాగుతున్న
# అష్టాదశ శక్తిపీఠ ప్రతిష్టా మహోత్సవాలు

కొండపాక, నవంబర్ 26, మనం న్యూస్ః కొండపాక శివారులోని ఆనంద నిలయం ఆవరణలో అష్టాదశ శక్తిపీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు వేద పండితుల ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం గురువందనము, ప్రాతః కాల పూజలు, మూలమంత్ర జపములు, చండీ పారాయణము, వేద పారాయణము, అష్టాదశ శక్తి పీఠముల, అనుస్థానములు, గణపతి మంటప దేవతాహోమములు, బింబసంస్కారము, మహోన్నహవనము, సాయంత్రం 4 గంటలకు చండీ హోమం, రుద్ర హోమములు, ధాన్య శర్య ఫల, పుష్ప హిరణ్యాదివాసములు, షోడష తత్వన్యాసము, హారతి, మంత్రపుష్పము, తీర్థ ప్రసాదములు, భగవన్నామస్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అష్టాదశ శక్తిపీఠ ట్రస్టు సభ్యులు, ఆనంద నిలయం ట్రసుట సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



కొమురవెల్లి, నవంబర్ 26, మనం న్యూస్ః మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన పబ్బోజు మల్లయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గొల్లపల్లి ఆంజనేయులు వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎక్కలదేవి రాజు, కడెం కరుణాకర్, కార్ల అఖిల్, ఆశం రవి, శ్రీను, బాలమల్లు, నర్సయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం

### ఏఎంసి డైరెక్టర్ ఏనుగు బాపురెడ్డి



ములుగు, నవంబర్ 26, మనం న్యూస్ః గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి, సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఏఎంసి డైరెక్టర్ ఏనుగు బాపురెడ్డి అన్నారు. ఆదివారం రోజున ములుగు మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలోని ప్రతి గడప గడపకు వెళ్లి ప్రజలకు బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించడంతోపాటు నమూనా ఈవియం మిషన్‌లో కారు గుర్తును చూపిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంతోపాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్న కేసీఆర్‌కు భారీ మెజార్టీ అందించి మూడవసారి ముచ్చటగా సీఎం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా బిఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. బీజేపి, కాంగ్రెస్ నాయకుల మోసపూరిత మాటలకు, హామీలకు ప్రజలు నమ్మి మోసపోయే స్థితిలో లేరన్నారు. ఎంతమంది నాయకులు వచ్చినా, ఎన్ని కుట్రలుపన్నినా గజ్వేల్‌లో గెలిచేది కేసీఆరే అని పేర్కొన్నారు.



## న్యాయశ్రీ అవార్డు అందుకున్న పెద్దలింగన్నగారి బిక్షపతి

మిరుదొడ్డి, నవంబర్ 26, మనం న్యూస్ః న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయశ్రీ అవార్డు అందుకున్న సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామానికి చెందిన పెద్దలింగన్నగారి బిక్షపతి పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రవీంద్రభారతిలో జరిగిన మెగా సిటీ కళావేదిక ఆధ్వర్యంలో హై కోర్టు న్యాయమూర్తి సూర్యపల్లి నంద, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనుమడు భీమ్‌రావ్ యశ్వంత్ చేతుల మీదుగా న్యాయశ్రీ 2023 అవార్డును అందుకోవడం జరిగింది. దీనిపట్ల లింగుపల్లి గ్రామస్తులతోపాటు మండల ప్రజలు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత బిక్షపతి మాట్లాడుతూ తనకు అవార్డు అందుకోవడంతో చాలా సంతృప్తికరంగా ఉందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల న్యాయం కోసం తాను ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కొండపాక, నవంబర్ 26, మనం న్యూస్ః కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం గ్రామానికి చెందిన బక్క బాల్‌సాయిలు శనివారం అకస్మాత్తుగా మృతి చెందాడు. కాగా మృతుని కుటుంబాన్ని ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్ పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. నిన్న మొన్న వరకు మాతోనే ప్రచారంలో పాల్గొన్న వ్యక్తి అకస్మాత్తుగా మృతి చెందడం చాలా బాధాకరమని, వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎల్లు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని వారి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

## క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

### అంతర్జాతీయ క్రీడలకు ఎంపికైన శ్రీవాణి విద్యార్థులు



సిద్దిపేట అర్బన్, నవంబర్ 26, మనం న్యూస్ః క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, అప్పుడే జీవితంలో అద్భుతంగా రానిస్తారని మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజనర్సు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి శ్రీవాణి హై స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట శ్రీవాణి పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయిలో ఆడడం అభినందనీయమన్నారు. డిసెంబర్ 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ క్రీడల్లో పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులను ఆయన సన్మానించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చాటి ప్రపంచ స్థాయిలో తెలంగాణను ముందు వరుసలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బర్ల మల్లికార్జున్, శ్రీనివాస్ యాదవ్, శ్రీవాణి పాఠశాల యాజమాన్యం గనగోని శ్రీకాంత్ గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుబ్బాకలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయం

### బీఆర్ఎస్ జిల్లా నాయకులు కాస కిష్టయ్య



మిరుదొడ్డి, నవంబర్ 26, మనం న్యూస్ః దుబ్బాకలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని బిఆర్ఎస్ జిల్లా నాయకులు కాస కిష్టయ్య అన్నారు. గత ప్రభుత్వాల్లో జరగని అభివృద్ధి బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావు ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్క రాజయ్యతోపాటు గ్రామ బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## జగజ్జననేత అంబేద్కర్



చిన్నకోడూరు, నవంబర్ 26, మనం న్యూస్ః భారత రాజ్యాంగాన్ని అనుసరించి మహనీయుడు అంబేద్కర్ సూచించిన మార్గంలో నడుద్దామని అల్లీపూర్ గ్రామ అంబేద్కర్ సంఘ సభ్యుడు కామ శ్రీనివాస్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగం భారత రాజ్యాంగమని, రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని అంబేద్కర్ చూపించిన దారిలో నడవాలన్నారు. ఆయన ఆశయాలను పాటిస్తూ దేశ అభ్యున్నతికి కృషి చేసి నవసమాజ నిర్మాణానికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాంకాళి మహేష్, ఆంకార్ ప్రవీణ్, మహేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిప్రదాత కేసీఆర్‌ను గెలిపిద్దాం



### రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్

కొండపాక, నవంబర్ 26, మనం న్యూస్: కుకునూరుపల్లి మండల ప్రదాత అభివృద్ధి ప్రదాత అయిన సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించి ఆయనకు కృతజ్ఞతగా నిలుద్దామని రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలో సర్పంచ్ కిరణ్‌కుమార్ చారితో కలిసి ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల ఈ ప్రాంత ప్రజల కల అయిన కుకునూరుపల్లి మండల ఏర్పాటును మంత్రి హరీష్‌రావు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా ఇద్దరి కృషితో మండలంగా ఏర్పాటు చేయడం పట్ల వారికి కృతజ్ఞతగా కేసీఆర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. మతతత్వ బీజేపి మాటలు నమ్మి మోసపోవద్దని, తెలంగాణ రైతులు పండించిన పంట కొనుగోలు చేయమంటే కొర్రీలు పెడుతుందని, రైతుల నడ్డి విరుస్తున్న బీజేపి అభ్యర్థులను మట్టికరిపించాలన్నారు. రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా సీఎం కేసీఆర్ కేంద్రం కొనకున్నా స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తుందన్నారు.

అలాంటి ప్రభుత్వాన్ని ఇలాగే కొనసాగించుకోవాలంటే గజ్వేల్‌లో కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ లగిశెట్టి కనకయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు కరుణాకర్, మోహన్‌రెడ్డి, సాయిబాబా, అనిల్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభకు తరలిన బిఆర్ఎస్ శ్రేణులు



దౌల్తాబాద్, నవంబర్ 26, మనం న్యూస్: దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్ధతుగా దౌల్తాబాద్ మండల పరిధిలోని ఆయా గ్రామాల నుండి పెద్ద ఎత్తున దుబ్బాకలో నిర్వహించిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడవసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యంగారి యాదగిరి, పిఎసిఎస్ డైరెక్టర్ రమేష్, యూత్ నాయకులు , మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగరాజు, స్వామి, నరేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపితోనే నియోజకవర్గం అభివృద్ధి

### -బీజేపి నాయకులు ఉసికె కనకయ్య



మిరుదొడ్డి, నవంబర్ 26, మనం న్యూస్: బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దని బీజేపి నాయకులు ఉసికె కనకయ్య అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండల కేంద్రంలో బీజేపి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయ కులు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మవద్దన్నారు. ప్రశ్నించే గొంతుకగా బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించుకున్నట్లయితే దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరుచుకోవచ్చన్నారు. ఆయన వెంట గ్రామ బీజేపి నాయకులు తదితరులు ఉన్నారు.

## రఘునందన్‌రావు గెలుపు నియోజకవర్గ అభివృద్ధికి మలుపు

### -నీలకంఠ సమాజం అధ్యక్షులు మర్గల సత్యానందం



దుబ్బాక, నవంబర్ 26, మనం న్యూస్: దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీజేపి అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయమని దుబ్బాక నీలకంఠ సమాజం అధ్యక్షులు మర్గల సత్యానందం అన్నారు. ఆదివారం రోజున ఆయన నీలకంఠ సమాజ సభ్యులతో కలిసి రఘునందన్‌రావుకు మద్ధతుగా దుబ్బాకలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తున్నాయని, ప్రజా సంక్షేమానికి నిరంతరం పాటుపడే వ్యక్తి రఘునందన్‌రావుతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కావున దుబ్బాక నియోజకవర్గ ఓటర్లంతా ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఈవియం మిషన్‌లోని 3వ నెంబర్‌పై కమలం పువ్వు గుర్తుకు ఓటేసి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## జాతీయ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

### -స్వతంత్ర అభ్యర్థి నీరుడి స్వామి

గజ్వేల్, నవంబర్ 26, మనం న్యూస్: గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపి పార్టీలకు ఈసారి ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన తనను గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి నీరుడి స్వామి ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం ఆయన గజ్వేల్‌లో కోటమైసమ్మ దేవాలయం నుండి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లంతా అగ్గిపెట్టె గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో ప్రజల వద్దకు వెళ్లి బిఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపిలు చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను, చేసిన మోసాలను వివరించడం జరుగుతుందన్నారు. సమాజంలో మార్పు రావాలని, మూడెకరాల భూమి, దళితబంధు, డబుల్ బెడ్‌రూమ్, నిరుద్యోగ భృతి, రుణమాఫీ వంటివి అన్ని కూడా ప్రభుత్వాలు ఇవ్వడంలో మోసం చేశాయన్నారు. కావున గజ్వేల్ ప్రజలు ఆలోచించి స్వతంత్ర అభ్యర్థి అయిన తనను అగ్గిపెట్టె గుర్తుకు ఓటు వేసి గెలిపించి ఆశీర్వదించాలని కోరారు.



## తెలంగాణ దళితులు దేశానికి ఆదర్శం

### -అంబేద్కర్ చూపిన బాటలో దేశం నడుస్తుంది... డిసెంబర్ 4న ఛలో ఢిల్లీ

### -ఐడిజేఎన్ వ్యవస్థాపకులు మాలెపల్లి లక్ష్మయ్య






సిద్దిపేట రూరల్, నవంబర్ 26, మనం న్యూస్: దేశంలో విద్య ద్వారానే రాజ్యాధికారం సాధించవచ్చని ఐడిజేఎన్ వ్యవస్థాపకులు మాలెపల్లి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన డిడబ్ల్యూజేఎస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ దళితులు చైతన్యవంతులై విద్యనభ్యసించాలన్నారు. అంబేద్కర్ చూపిన బాటలోనే దేశం నడుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థలో అనేకమార్పులు చోటు చేసుకున్నాయన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలను వేయికి పైగా ఏర్పాటు చేసి అన్ని వర్గాలు విద్యను అందుకునేలా అవకాశం కల్పించిందన్నారు. ఎస్సీ ఎస్టీ, బిసి మైనార్టీ వర్గాలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దేశం మొత్తం మిగతా రాష్ట్రాల్లో ఎక్కడా కూడా అమలవడం లేదన్నారు. బహుజన వర్గాలందరూ విద్యను అందిపుచ్చుకోవాలన్నారు. రాష్ట్రంలో గ్రామాలన్నీ ఉత్తమ గ్రామాలుగా అవార్డులు పొందుతున్నాయన్నారు. జర్నలిస్టులు, ఉద్యోగస్తులు, విద్యావంతులు, దళిత సంఘం నాయకులు ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. డిసెంబర్ 4న జరిగే నేషనల్ దళిత్ సమ్మిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా డిడబ్ల్యూజేఎస్ అధ్యక్షులు జంగం రాజలింగం, ప్రధాన కార్యదర్శి మంద జానర్ధన్, కోశాధికారి చంద్రం, సభ్యులు ఎల్లం, అడ్వకేట్ పత్రి ప్రకాష్, కనకయ్య, డివిజన్ కోశాధికారి నర్సింహా, రాజు, ఆస లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి బిఆర్ఎస్ శ్రీరామరక్ష

**-వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్‌లోకి చేరికలు**

**-ఇంటింటా కేసీఆర్‌కు మద్ధతుగా బిఆర్ఎస్ శ్రేణుల ప్రచారాలు**

గజ్వేల్/జగదేవ్‌పూర్, నవంబర్ 26, మనం న్యూస్ః తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బిఆర్ఎస్ శ్రీరామ రక్షలా నిలుస్తుందని ఎఫ్‌డిసి ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజే పిల నుండి బిఆర్ఎస్‌లో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం జగదేవ్‌పూర్ మండలానికి చెందిన పలువురు పిట్టల నరస్సింలు, దాసు, వెంకటేశం, రాజు, బాబు, వెంకటేశం, అంజయ్య, పిట్టల రాములు, కర్ణాకర్, ప్రవీణ్,ముదిరాజ్ అధ్యక్షులు రాజు, రమేష్, రాములుతోపాటు పలువురు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. పదేళ్లలో తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షులు కిరణ్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షులు ఆంజనేయులు, ఆత్మ కమిటీ డైరెక్టర్ ఐలయ్య, కోఆప్షన్ కృష్ణ గౌడ్, రతన్, పరమేశ్వర్, నరేష్, రాజు , నర్సింలు పాల్గొన్నారు.

**-బిఆర్ఎస్‌వైపే యువత**

ఈ సారి యువత సీఎం కేసీఆర్ వైపే ఉన్నారని, తమ ఓట్లన్నీ బిఆర్ఎస్‌కే అంటున్నారని దౌలాపూర్ ఉప సర్పంచ్ యాదలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసి వైస్ ఛైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కొన్నె జయమ్మలు అన్నారు. ఆదివారం వారు దౌలాపూర్‌లో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసి యువతకు బిఆర్ఎస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి బిఆర్ఎస్ యువత కోసం చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం 60 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా కేవలం పదేళ్లలోనే ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. దౌలాపూర్‌లో గడపగడపకు ఇంటింటికి ప్రచారం చేస్తుంటే ప్రతి ఒక్కరు బిఆర్ఎస్‌కే తమ మద్ధతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారిని అభినందిస్తూ ఓడిన వారు గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దేవేందర్, సౌందర్య రామచంద్రం, రామస్వామి , గ్రామశాఖ అధ్యక్షులు జూపల్లి మధు,





యూత్ అధ్యక్షులు జూపల్లి బంగారి సిద్ధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**-కారుకు ఎదురు లేదు**

గ్రామగ్రామాన ప్రజలు బిఆర్ఎస్ పట్ల చూపిస్తున్న ఆదరణ చూస్తుంటే ఈసారి ఎన్నికల్లో కారుకు ఎదురు లేదని ఎంపిటిసి కవిత శ్రీనివాస్‌రెడ్డి, తెరాస మండల పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్, నాచారం ఆలయ డైరెక్టర్ బుద్ధ నాగరాజు, కొండపోచమ్మ ఆలయ డైరెక్టర్ కనకయ్య, ఉప సర్పంచ్ బింగి మల్లేశంలు అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో తెరాస పార్టీ తరుపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయని, వారి జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గజ్వేల్ నియోజకవర్గం ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు అభివృద్ధిలో మోడల్‌గా నిలుస్తుందన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను కాపీ కొడుతుందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపిలవి స్వార్థపూరిత రాజకీయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బింగి మల్లేశం, వార్డు మెంబర్ కొంపల్లి మహేష బుద్ధ చిన్న సత్యం, నాయకులు మచ్చ బాబు మచ్చ భాస్కర్, ఖాదీర్, పాషా, ఆజీమ్ భాస్కర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

**-విస్తృత ప్రచారం**

ప్రజలంతా బిఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారని గజ్వేల్ మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో హై కోర్టు లాయర్లు, గజ్వేల్ బార్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, నాచారం ఆలయ మాజీ ఛైర్మన్ కొట్టాల యాదగిరితో కలిసి మాట్లడుతూ ప్రజలు బిఆర్ఎస్ వైపే ఉన్నారని, ప్రతి ఒక్కరు కారు గుర్తుకే ఓటు వేస్తామని హామీ ఇస్తున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీ కోసం న్యాయవాదులు ప్రచారం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 30న ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, యాదగిరి, సురేష్ తదితరులు ఉన్నారు.












## పోలింగ్‌కు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలి

## జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్



సంగారెడ్డి, నవంబర్ 26, మనం న్యూస్ః సంగారెడ్డి జిల్లాలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు విధుల్లో పాల్గొనే అధికారులంతా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ అన్నారు. ఆదివారం రోజున జిల్లా సెక్టోరియల్ అధికారులు, ఎన్నికల విభాగపు అధికారులు, ఆయా శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పోలింగ్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి రిజిస్టర్లను నిర్వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలని సెక్టోరియల్ అధికారులకు సూచించారు.ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి టీమ్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాదురి తదితరులు పాల్గొన్నారు.



## వ్యక్తిగత రక్షణకు కరాటే అత్యావసరం

సిద్దిపేట రూరల్, నవంబర్ 26, మనం న్యూస్ః శారీరక ధృఢత్వానికి, వ్యక్తిగత రక్షణకు కరాటే నేర్చుకోవాలని స్ప్రింగ్‌డేల్ పాఠశాల ప్రిన్సిపల్ రాజమణి అన్నారు. ఆదివారం స్ప్రింగ్‌డేల్ స్కూల్‌లో షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో కరాటే బెల్టు టెస్ట్ నిర్వహించారు. కరాటే బెల్ట్ ఎగ్జామ్ నిర్వాహకులు కెమ్మసారం మధు మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణతోపాటు శారీరక ధృఢత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే కరాటే నేర్చుకున్నట్లయితే జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి



సిద్దిపేట, నవంబర్ 26, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ శాసనసభ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జె పాటిల్ ఇందూర్ కళాశాలలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లు, కావాల్సిన మౌలిక సదుపాయాలపై ఆరా తీసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైదానంలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌ఓలు గరిమా అగ్రవాల్, రమేష్‌బాబు, బన్సీలాల్, బెన్‌షాలెమ్, ఏఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



# దేశం మెచ్చేలా తెలంగాణ









## సిద్దిపేట మా కుటుంబం

## తెలంగాణ ఢిల్లీకి గులాం కాదు

సిద్దిపేట, నవంబర్ 26, మనం న్యూస్ ప్రతినిధిః తెలంగాణ రాష్ట్రం పోరాడి తెచ్చుకున్న రాష్ట్రమని, దేశానికే నెంబర్ వన్‌గా నిలిచిందని మంత్రి హరీష్‌రావు సతీమణి శ్రీనిత అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని పలు వార్డుల్లో, రూరల్ మండలంలోని రాఘవాపూర్‌లో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ సిద్దిపేట పేరు దేశవ్యాప్తం చేసిన హరీష్‌రావు పేరును ప్రపంచవ్యాప్తం చేయాలని ఆమె ప్రజలను కోరారు. హరీష్‌రావు ఎక్కడికి వెళ్లినా ఏది చూసినా అది సిద్దిపేట ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాడన్నారు. 20 సంవత్సరాల కింద సిద్దిపేటకు ఇప్పటి సిద్దిపేటకు ఎంతో తేడా ఉందన్నారు. రాఘవాపూర్ గ్రామానికి నేను కూతురిని అయ్యానని, అల్లునికి కట్నంగా ఏమిస్తారని అడిగారు. ప్రతి గ్రామస్తులు బిఆర్ఎస్ పార్టీకి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలన్నా, గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా అది బిఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్, బీజేపి మాటలను నమ్మవద్దన్నారు. తెలంగాణలో చిచ్చు రేపేందుకే ఉత్తరాది నాయకులు ప్రచారంలో పాల్గొన్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి వెళ్లినా తెలంగాణ ఒక దిక్సూచిగా అభివృద్ధి చెందిందన్నారు. గ్రామం నుంచి ఒక్క ఓటు వేరే పార్టీకి వేయకుండా కారు గుర్తుకు ఓటేయాలన్నారు. పల్లెలన్నీ సస్యశ్యామలమై రెండు పంటలు పండే విధంగా తీసుకువచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, ఏఎంసి ఛైర్మన్ మచ్చ విజిత, వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు కవిత సంపత్‌రెడ్డి, బ్రహ్మం, గుడాల సంధ్య, శ్రీకాంత్‌గౌడ్, భూంపల్లి శ్రీలత శ్రీహరి, సాకి బాల్‌లక్ష్మి ఆనంద్, సుడా ఛైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి, ఎంపిపి గన్నమనేని శ్రీదేవి, సర్పంచ్ రమేష్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రావు, బాలకిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### –నంగునూరులో....

నంగునూరు మండల పరిధిలోని బద్దిపడగ సిద్దన్నపేట గ్రామాల్లో ఆదివారం తెరాస పార్టీ ఆధ్వర్యంలో హరీష్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పిటిసి తడిసిన ఉమా వెంకట్‌రెడ్డి, ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి, ఏఎంసి ఛైర్మన్ రాగుల సారయ్యలు మాట్లాడుతూ ఈసారి హరీష్‌రావుకు లక్షా యాభై వేల మెజార్టీ రావడం ఖాయమని, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా తాము తెరాస పార్టీకి ఓటేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్కే దక్కుతుందన్నారు. అలాంటి పథకాలు మళ్లీ కొనసాగాలంటే ఈసారి కూడా రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దువ్వల మల్లయ్య, బద్దిపడగ కృష్ణారెడ్డితోపాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.





